క్లుప్తంగా

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



అమలాపురంలో మజ్జిగ అందిస్తున్న ఎఫ్ 3 ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణంలోని మెయిన్ రోడ్డుపై బుధవారం మండుటెండలో బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై వెళుతున్న ప్రయాణికులకు ఎఫ్ 3 ఫౌండేషన్ ప్రతినిధులు చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు. బస్సుల్లోకి ఫౌండేషన్ ప్రతినిధులు వెళ్లి ప్రయాణికులకు మజ్జిగ గ్లాసులు అందించారు. కార్లను, ద్విచక్ర వాహనాలను ఆపి వారికి చల్లటి మజ్జిగ అందించి దాహార్తిని తీర్చారు. దాదాపు 2 వేల మంది ప్రయాణికులు మజ్జిగ పంపిణీ చేశారు. ఎఫ్ 3 ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పటాని అబ్జాని (జానీ) ఆధ్వర్యంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఈ సేవలు అందించారు.

ప్రభుత్వ ఐటీఐలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో 2025–26 విద్యాసంవత్సరానికి వివిధ ట్రేడుల్లో శిక్షణ కోసం సెంటాక్ పోర్టల్ ద్వారా మే 9 నుంచి అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నారని బుధవారం ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణసుధాకర్ తెలిపారు. ఆసక్తిగలిగిన యానాం రీజియన్ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైర్‌మేన్, మెకానిక్ మోటార్ వెహికల్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ ట్రేడుల్లో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 0884–2951001, 9491441164 ను సంప్రదించాలని కోరారు.

అభ్యుదయ యుగకర్త మహా కవి శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కవులు

అమలాపురం టౌన్: శ్రీశ్రీ కళా వేదిక, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక దాబా గార్డెన్స్‌లో బుధవారం మహా కవి శ్రీశ్రీ జయంతి సభను నిర్వహించారు. జిల్లా శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ ఆధునిక కవిత్వాన్ని మరో మలుపు తిప్పిన అభ్యుదయ యుగ కర్త కవి శ్రీశ్రీ అని పేర్కొన్నారు. శ్రీశ్రీ చిత్ర పటానికి కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీశ్రీ కవిత్వంపై కవి సమ్మేళనం నిర్వహించారు.

పీహెచ్‌సీల్లో వైద్య సేవలపై సమీక్ష

అల్లవరం: పీహెచ్‌సీల్లో పతి నిత్యం రోగులకు అందించే వైద్య సేవలపై పర్యవేక్షణాధికారి టీకే శ్రీనివాసరావు బుధవారం పరిశీలన చేసి సమీక్ష నిర్వహించారు. గోడిలంక పీహెచ్‌సీ వద్ద వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీకే శ్రీనివాసరావు మాట్లాడుతూ పీహెచ్‌సీలో రోజూ నిర్వహించే కార్యక్రమాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదన్నారు. గోడిలంక, బెండమూర్లంక పీహెచ్‌సీ వైద్యాధికారులు లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సుమ, స్పందన, బాలసుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది ప్రసాదు పాల్గొన్నారు.

దాతల సహకారంతో శ్మశాన వాటిక నిర్మాణం

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలో వైనతేయ నది ఒడ్డున దాతల సహకారంతో సమకూర్చిన నిధులు రూ.10 లక్షల నిధులతో నిర్మించిన హిందూ శ్మశాన వాటికను సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి బుధవారం ప్రారంభించారు. శ్మశాన వాటిక లేక ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందని, శ్మశాన వాటిక నిర్మాణంతో ఈ బాధలు నుంచి ఉపశమనం లభిస్తుందని సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో కలిగినీడి బేబి, అడపా శ్రీను, అరవ చంటి, చుండూరి శ్రీను పాల్గొన్నారు.

పవన్‌కుమార్ సేవా పురస్కారం

అమలాపురం రూరల్: నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్‌కుమార్ చేస్తున్న సేవలకు గుర్తించి మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు సేవా పురస్కారాన్ని అందించారు. మమతా స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో పి.గన్నవరంలో మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు సేవా పురస్కారం ప్రదాన కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. బుధవారం పవన్‌కుమార్‌కు గణపతిరావు సేవా పురస్కారం అందించి ఘనంగా సన్మానించారు. మమత స్వచ్ఛంద సేవా సమితి నాయకులు, నీతిపూడి గణపతిరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుండె చెరువు

- పంచాయతీ చెరువుల ఆధునీకరణ కరవు
- అపరిశుభ్రతకు నెలవుగా మారి దుర్గంధం వ్యాప్తి
- గ్రామాల్లో పలుచోట్ల ఆక్రమణ
- షాపులు, గృహాల నిర్మాణం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ముమ్మిడివరం: ఆంగ్లేయుల కాలంలో గ్రామాల నడిబొడ్డులో నిర్మించిన చెరువులు నేడు పంచాయతీ పాలకవర్గాల నిర్లక్ష్యం వల్ల అవి కాలుష్య కేంద్రాలుగా మారి దుర్గంధం వ్యాపిస్తోంది. చెరువుల చుట్టూ పారిశుధ్య సమస్య తలెత్తి అంటువ్యాధులు ప్రబలు తుండటంతో గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. మండల పరిధిలోని పంచాయతీ చెరువుల దుస్థితిని పట్టించుకునే నాథుడు కరువయ్యారు. చెరువులు ప్రస్తుతం మురుగునీటితో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుండగా, కొన్ని ఆక్రమణకు గురయ్యాయి.

నియోజకవర్గంలో 120 చెరువులు

నియోజకవర్గంలో ఎపంచాయతీలకు సంబంధించి 120 వరకు చెరువులున్నాయి. ఈ చెరువుల్లో చేపల పెంపకం, గట్టుపై కొబ్బరి ఫలసాయం ద్వారా ఏటా లక్షలాది రూపాయల ఆదాయం పంచాయతీలకు సమకూరుతుంది. కొన్ని మైనర్ పంచాయతీల ఆదాయంలో సగానికి పైగా ఈవిధంగానే వస్తోంది. ఎన్నో ఏళ్ల క్రితం తాగునీరు, ఇతర ప్రజావసరాల కోసం గ్రామాల నడిబొడ్డున విశాలమైన స్థలంలో చెరువులు తవ్వించారు. ఇదివరకు గ్రామానికి అలంకారంగా ఉండే ఈ చెరువులు నేడు వెలవెలబోతున్నాయి. గుర్రపు డెక్క, తూడు పేరుకుపోయి అధ్వానంగా తయారయ్యాయి. చెరువులకు కాలువ ద్వారా నీరు పెట్టేందుకు మురుగు నీరు తొలగించేందుకు నిర్మించిన బోదెలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో చెరువుల్లో మురుగు నీరు నిల్వ ఉండి పసర్లు కట్టి దుర్గంధం వెదజల్లుతోంది.

చెరువులను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు

కొన్ని చెరువులను ఆక్రమించి పక్కా భవనాలు నిర్మించారు. మండలంలో సుమారు 537 మంది చెరువులను ఈ విధంగా ఆక్రమించుకున్నట్లు రెవెన్యూ అధికారుల సర్వేలో వెల్లడయ్యింది. గతంలో కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులు నోటీసులు కూడా జారీ చేసినా ఫలితం శూన్యం. ఈ అక్రమణ నిర్మాణాలు, గృహాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు పంచాయతీ, సహకార సంఘాల కార్యాలయ భవనాలు, దేవాలయాలు, వివిధ వ్యాపార సంస్థల షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి.



గాడిలంక పంచాయతీ చెరువు దుస్థితి

చేపల మేతగా వ్యర్థ పదార్థాలు వేయడంతో అనర్థం

పంచాయతీ చెరువులు మురుగునీటితో నిండిపోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. చేపలు పెంచుకునేందుకు కౌలుకు తీసుకున్న పాటదారులు చేపలకు ఎరువుగా కోడి, పశువుల పెంట, రసాయనాలు, ఇతర వ్యర్థపదార్థాలను ఉపయోగించడం వల్ల నీరు కలుషితమవుతోంది. దాంతో పరిసర ప్రాంతాల్లో నివాసముండే వారు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. మురుగు నీటివల్ల దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలక వర్గాలు, అధికారులు స్పందించి గ్రామ చెరువుల ఆధునీకరణపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధునీకరించాలి



గ్రామ నడి బొడ్డున్న ఉన్న పంచాయతీ చెరువులను బాగుచేయాలి. పూడికలు, తూడు తొలగించాలి. మురుగునీరు దిగేందుకు చర్యలు చేపట్టాలి. పంచాయతీ చెరువులను సందరంగా తీర్చిదిద్దాలి. ప్రతి పంచాయతీలో చెరువులు, భూములు ఆక్రమణలకు గురయ్యాయి. వాటిని గుర్తించి ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.

– బొర్రా విష్ణు, అయినాపురం

పాఠశాలల వద్ద షాపులు తొలగించాలి

అమలాపురం టౌన్: అమలాపురం హైస్కూలు సెంటరులోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆనుకుని గతంలో నిర్మించిన షాపులను తొలగించాలని స్థానిక సీనియర్ సివిల్ కోర్టు ఆదేశించింది. ఇదే వివాదంపై గతంలో ఆ రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా పరిషత్‌కు చెందిన స్థలాన్ని ఆక్రమించుకుని దాదాపు 40 షాపులు నిర్మించారని అప్పట్లో ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కోర్టు ఇచ్చిన తీర్పు ఆదేశాలను అమలు చేసేందుకు జిల్లా పరిషత్ త్వరలో చర్యలు తీసుకోనుందని తెలిసింది. జిల్లా పరిషత్ అధికారులు కూడా కోర్టు ఆదేశాలపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును సంప్రదించినప్పుడు జడ్పీ పాఠశాలలు మున్సిపాలిటీ పరిధిలో లేవని, జిల్లా పరిషత్ వారే కోర్టు ఆదేశాలపై స్పందించాల్సి ఉందని తెలిపారు. షాపుల యాజమానులు కొందరు అప్పట్లో కోర్టులను ఆశ్రయించారు. తొలత స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో పిల్ వేయగా అప్పట్లో పిటిషన్‌ను ఆ కోర్టు కొట్టేసింది. తిరిగి ఆ షాపు యాజమానులు స్థానిక సీనియర్ సివిల్ కోర్టులో కేసు వేయగా ఆ షాపుల స్థలం జిల్లా పరిషత్‌కే చెందుతాయని, ఆ స్థలాల్లో షాపులను తొలగించాలని కోర్టు తీర్పు ఇచ్చింది.

సమగ్ర శిక్ష కార్యాలయానికి బీరువా బహూకరణ



డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషాను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ముమ్మిడివరం: సమగ్ర శిక్షా కార్యాలయానికి పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) బీరువా బహూకరించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంభాషా ఆధ్వర్యంలో అకడమిక్ మానటరింగ్ అధికారి పి.రాంబాబుకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరాల కృష్ణకుమార్, దీపాటి సురేష్‌బాబు రూ.12వేలు విలువైన బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం సమగ్ర శిక్షా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినందుకు డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషాను పీఆర్‌టీయూ నాయకులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో బీవీ సుబ్రమణ్యం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సూపరిండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, పీఆర్‌టీయూ వర్కింగ్ ప్రెశిడెంట్ ఎం.అమృతరావు, పాలూరి గోపాలకృష్ణ, కడియాల గోవిందరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా పోటీలు



బహుమతులు, ధ్రువీకరణ పత్రాలతో యోగా పోటీల విజేతలు, చిత్రంలో యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. 3 నుంచి పదో తరగతి చదువుతూ యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న 80 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని యోగాలో సత్తా చాటారు. విద్యార్థుల శరీర బరువు ఆధారంగా ఈ పోటీలను నాలుగు కేటగిరీల్లో నిర్వహించారు. గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో న్యాయవాది కూచిమంచి శశిధర్ శ్రీరామ్ సహకారంతో నిర్వహించిన ఈ పోటీలకు హాజరైన యోగా విద్యార్థులకు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు భోజన వసతి ఏర్పాట్లు చేశారు. 25 కేజీల కేటగిరిలో ఎం.లావణ్య, టి.సాత్విక్, బి.మధు, ఎల్.చంటి, 30 కేజీల కేటగిరిలో ఎం.శ్రీను, బి.మధు, 35 కేజీల కేటగిరిలో ఎల్.ఫణీంద్రకుమార్, బి.దైవసాత్విక్, ఎం.దుర్గాదేవి, 38 కేజీలో కేటగిరిలో ఎం.దుర్గారావు, ఎల్.దినేష్, ఎం.లావణ్య, ఎ.సురేష్ జిల్లా స్థాయిలో ప్రతిభ చాటారు. విజేతలకు న్యాయవాది కూచిమంచి శశిధర్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందించారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి విజేతలైన విద్యార్థులు వచ్చే జూన్‌లో అమలాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గోటేటి గంగాధరరావు, పుత్సా కృష్ణ కామేశ్వర్ వ్యవహరించారు.

నేటి నుంచి వీరేశ్వరుడికి 'బ్రహ్మోత్సవం'

- ఐదురోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన భద్రకాళీ సమేత వీరేశ్వరుడు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 1 గురువారం నుంచి 5 సోమవారం వరకూ ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. భద్రకాళి సమేత వీరేశ్వరస్వామికి పాంచాహ్నిక దీక్షతో శైవాగమ శాస్త్ర ప్రకారం ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శైవాగమ పండితుడి ఆదిశైవ అర్చక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్య సీతారామశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుని పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. 1వ తేదీన గణపతి పూజ, పంచాగవ్యారధన, దీక్షా ధారణ, అభిషేకాలు, నూతన వధూవరులుగా అలంకరణ, ధ్వజారోహణ, సాయంత్రం భద్ర పీఠంపై గ్రామోత్సవం, ఆలయ ప్రదక్షిణ, స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం 2న లక్ష్మీగణపతి హోమం, ప్రధాన కలశారధన, వాస్తు పూజ, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు, 3న పంచవింశతి కలశ స్థాపన పూర్వక అభిషేకం, సరస్వతీ హోమం, రుద్రహోమం, సాయంత్రం సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం, 4న గవ్యాంతము, చండీహోమం, కళాహోమాలు, సాయంత్రం నంది వాహనంపై గ్రామోత్సవం, 5న పూర్ణాహుతి, వసంతోత్సవం, వృద్ధ గౌతమీ నదిలో త్రిశూలస్నానం, స్వామి,అమ్మవారిని రథంపై ఊరేగింపు, పుష్పోత్సవం, పవళింపు సేవ, నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ ఆవరణలో యాగశాల, చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ తదితర కార్యక్రమాలు పూర్తయ్యాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

ఎస్సై వెంకటరమణ సేవలు అభినందనీయం



ఎస్సై వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్

అమలాపురం టౌన్: అమలాపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్సైగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన సీహెచ్ వెంకటరమణ సేవలు అభినందనీయమని స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్ కొనియాడారు. ఎస్సై వెంకటరమణ వీడ్కోలు సభ బుధవారం సాయంత్రం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. సీఐ రాజశేఖర్‌తో పాటు డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్పీ కార్యాలయం ఏవో జగన్నాథరావు, క్రైమ్ ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, ఎస్పీ కార్యాలయ తోటి ఎస్సైలు మాట్లాడుతూ ఎస్సై వెంకటరమణ సేవలను కొనియాడారు. చివరగా ఎస్సై వెంకటరమణ దంపతులను ఎస్పీ కార్యాలయం సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అందుబాటులో లేకపోయినప్పటికీ ఆయన ఆదేశాలతో ఎస్సై వెంకటరమణ వీడ్కోలు సభను నిర్వహించినట్లు డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాస్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి



అమలాపురంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న మాల మహానాడు నాయకులు

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో అమలాపురం గడియారం స్తంభం సెంటరులో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో తప్పుడు విధానాన్ని అవలంభిస్తోందని ఆరోపించారు. మాల మహానాడు నాయకులు చీకురుమిల్లి కిరణ్‌కుమార్, కాశి వీర వెంకట సత్యనారాయణ, పోతుల వెంకట్ సుందరం, వరలక్ష్మీ నరసింహరామ్, బీర అన్నవరం తదితరులు కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

త్వరలో యూడీసీ, ఎల్‌డీసీ పోస్టుల భర్తీ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 300 ఎల్‌డీసీ, యూడీసీ పోస్టులను మే నెలలో దశల వారీగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం రంగసామి ప్రకటించారు. బుధవారం పుదుచ్చేరిలో ఆయన బాలికలకు సైకిళ్లు, 60 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు బూట్లు, బ్లాంకెట్లు అందజేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నమశ్శివాయం, జయకుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత

తాళ్లరేవు: గ్రామాల్లో జరిగే బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పలువురు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కోరంగి, తాళ్లరేవు, ఇంజరం, సుంకరపాలెం, పిల్లంక గ్రామ పంచాయతీల్లో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ ప్రతినిధులతోపాటు ప్రజాప్రతినిధులు, పూజారులు, పాస్టర్లు, మతాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొని బాల్య వివాహాలను అరికడతాం అంటూ ప్రతిజ్ఞ చేసారు. ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఫౌండేషన్ ప్రతినిధి పిల్లి త్రిమూర్తులు, సోషల్ వర్కర్ చిన బాబు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నా



అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

అమలాపురం రూరల్: రెండేళ్లుగా జీతాల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నామని కోనసీమ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు అన్నారు.ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారు కలెక్టరేట్ వద్ద మూడు రోజులుగా వారు సమ్మె చేస్తున్నారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు పి. మమత జ్యోతి, జిల్లావర్కింగ్ అధ్యక్షుడు ఏ. సాయి శంకర్, జిల్లా కార్యదర్శి,కె. సాయి తేజలు ఆధ్వర్యంలో జిల్లాలో పలు మండలాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొని బుధవారం ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు పి. మమత జ్యోతి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి శివ, టీ మనోహర్, జల్లి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ మద్దతు

ఎపీఎంసీపీ రాష్ట్ర నాయకులు ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ అధ్యక్షుడు శివరెడ్డిని మర్యాదపూర్వకంగా బుధవారం కలిసారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మెకు వారు మద్దతు తెలిపారు. కార్యక్రమంలోఏపీఎంసీపీ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్,సెక్రటరీ సందీప్ కుమార్, కోఆర్డినేటర్ వినోద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: అంబేడ్కర్ ఆశయాలు సాధనకు యువత కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటు ఇన్‌చార్జ్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. జనుపల్లి అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వరూప్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, రూరల్ యూత్ అధ్యక్షుడు కేతా భానుతేజ, మాజీ నక్కా సంపత్‌కుమార్, తిరుకోటి సతీష్‌కుమార్, కుమ్మరి అభి, పెయ్యాల సాయి, ముషిణి రాఘవేంద్ర పాల్గొన్నారు. జనుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళిలర్పించారు. ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, వాకపల్లి స్వామి నాయుడు పాల్గొన్నారు.

నేత్ర దానం

తాళ్లరేవు: కేశవపురానికి చెందిన రెడ్డి చంద్రరావు(85) బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందజేసారు. ఐ బ్యాంక్ సిబ్బంది చంద్రరావు కార్నియాలను సేకరించారు. కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్న ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన ధన్యజీవి రెడ్డి చంద్రరావు అని సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ అన్నారు.

పిల్లలకు నైతిక విలువలపై శిక్షణ

అమలాపురం టౌన్: శ్రీసత్యసాయి బాల వికాస్ గురువులు పిల్లలకు నైతిక విలువలపై, కుటుంబ బంధాల ప్రాధాన్యతపైన వారం రోజులపాటు శిక్షణ ఇచ్చే ఓ ప్రయోజిక కార్యక్రమం స్థానిక శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ప్రారంభమైంది. ఈనెల 29 నుంచి మే 6వ తేదీ వరకూ సత్యసాయి బాల వికాస్ వేసవి శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నట్లు అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ తెలిపారు. జిల్లా బాల వికాస్ గురువు శిష్టా గుణరంజన్, బాల వికాస్ మహిళా కో ఆర్డినేటర్లు నీలమ, భవానిలు తొలుత సత్యసాయి బాబా చిత్ర పటానికి పూజలు చేసి ఈ శిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టారు. అంశాలవారీగా ఆయా రంగాల నిపుణులతో బాల బాలికలకు ప్రతి రోజూ శిక్షణనిస్తామని బాల వికాస్ గురువు గుణ రంజన్ తెలిపారు. తొలి రోజు వేసవి శిక్షణా తరగతులకు దాదాపు 150 బాల బాలికలు హాజరయ్యారు.

జిప్‌మర్ ఆసుపత్రిలో సేవలపై సమీక్ష

యానాం: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో యానాంలో జిప్‌మర్ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించేలా బుధవారం ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, తదితర ఉన్నతాధికారులతో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చర్చించారు. ఇటీవలి మల్లాడి కృష్ణారావు కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాతో సమావేశమై జిప్‌మర్ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లిన నేపథ్యంలో ఏపీ ఆరోగ్యశాఖకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిప్‌మర్ డైరెక్టర్ డాక్టర్ వీఎస్ నేగి, వైద్యశాఖ ప్రత్యేకకార్యదర్శి కృష్ణబాబు, వైద్యశాఖ డైరెక్టర్ సిరి, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసింహం తదితరులుతో జిప్‌మర్‌లో వైద్యుల సేవలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ దిలీప్‌మౌర్య, జిప్‌మెర్ యానాం ఇన్‌ఛార్జి ఎం ఆనందరాజ్ పాల్గొన్నారు.

పదవీ విరమణ రోజునే పదోన్నతులు

యానాం: యానాం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ)లో జూనియర్ ఇంజనీరు పితాని వీఎస్ భాస్కరరావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన పదవీ విరమణ రోజునాడే అసిస్టెంట్ ఇంజనీరు(ఏఈ)గా పదోన్నతినిస్తూ పుదుచ్చేరి నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. మరో అరగంటకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు(ఈఈ)గా పదోన్నతినిస్తూ మళ్లీ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు హోదాలో ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సిబ్బంది ఘనంగా సత్కరించారు. స్థానిక పీడబ్ల్యూడీ ఆవరణలో శాఖాపరంగా నిర్వహించిన కార్యక్రమంలో భాస్కరరావును పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఘనంగా సత్కరించారు. అంబేడ్కర్ విజ్ఞాన్‌భవన్‌లో ఆది ద్రావిడ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీ రేకాడి కృష్ణమూర్తి, వెల్ఫేర్ ఆఫీసర్ రవి, ఇన్‌చార్జి కొల్లు నూకాంబరం పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు వాకర్స్ నివాళి



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: కశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై జరిపిన దాడిలో మృతి చెందిన వారికి స్థానిక వాకర్స్ క్లబ్ సభ్యులు ఘన నివాళులర్పించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో బుధవారం రాత్రి వాకర్స్ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, ముమ్మిడివరం మదర్ థెరిస్సా మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.కమలసాయి, సంజీవిని మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు జల్లి సుజాత, నడిపూడి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.